నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 22 మార్చి 2025 | HYDERABAD


## ఇలంబర్తి.. ఇవేం రూల్స్!



II

- ఆర్థిక సంక్షోభం అంటూనే ప్రైవేట్ సైన్యం
- ఇప్పటికే ఆంక్షల నడుమ ప్రజావాణి
- సెల్‌ఫోన్ సరెండర్ చేస్తేనే అర్జీదారులకు అనుమతి
- రోజూ వారీ సందర్శకులకు ప్రవేశ ద్వారం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డుగోడ
- సవాలక్ష ప్రశ్నలు..రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేసుకున్నాకే లోనికి ఎంట్రీ
- తాజాగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 113 మంది నియమకానికి రంగం సిద్ధం
- కార్పొరేట్ తరహాలో కార్పొరేషన్‌లోకి పది మంది మార్షల్స్
- పౌర సేవలందించే సంస్థలో మార్షల్స్‌కు ఏం పని అని కార్పొరేటర్ల విమర్శలు

## సర్క్యులర్ ఉపసంహరించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళనలు నిర్వహించడానికి వీలు లేదని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ జారీ చేసిన సర్క్యులర్ ఉపసంహరించుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను కలిసి వినతి పత్రం అందజేశారు.



# టెస్టులు చేయరు..మందులివ్వరు



చింతల్ డివిజన్, భగత్ సింగ్ నగర్ లో డ్యూటీ డాక్టరు సెలవులో ఉండడంతో వైద్య సేవ అందిస్తున్న స్టాఫ్ నర్స్




కొత్తగూడ బస్తీ దవాఖానలో డాక్టర్ లేకపోవడంతో నర్సింగ్ సిబ్బందే చికిత్స అందిస్తున్న దృశ్యం



రంగారెడ్డి నగరి డివిజన్‌లోని నందానగర్ బస్తీ దవాఖానాలో మందుల కొరత కారణంగా పేషెంట్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

## బస్తీ దవాఖానల్లో డాక్టర్ల కొరత.. నర్సులే వైద్యులు

## అవస్థల పాలవుతున్న బస్తీ దవాఖానలు



సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ)/మైలార్‌దేవ్‌పల్లి/బాలానగర్/కుత్బుల్లాపూర్/ కొండాపూర్ : హైదరాబాద్ ను ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దే మహోన్నత ఉద్దేశంతో నాటి కేసీఆర్ సర్కార్ బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తే ఆ సమున్నత ఆశయానికి నేటి ప్రభుత్వం గండి కొడుతున్నది. చిన్న చిన్న వ్యాధులకు బస్తీ స్థాయిలోనే చెక్ పెట్టేందుకు అందుబాటులోకి వచ్చిననీ దవాఖానలు కాంగ్రెస్ పాలనతో అంతులేని నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

### ప్రతి 10వేల మందికి...

అందరికీ ఆరోగ్యం అందాలి..రోగం బస్తీ స్థాయిలోనే నయమవాలి అనే తపనతో నాటి కేసీఆర్ సర్కారు ప్రతి 10వేల మందికి ఒక బస్తీ దవాఖానను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో 2018లో 40 కేంద్రాలతో ప్రారంభమైన బస్తీ దవాఖానలు దశల వారీగా గ్రేటర్ వ్యాప్తంగా 292కు, రాష్ట్ర వ్యాప్తంగా 468కి విస్తరించాయి. ఈ బస్తీ దవాఖానల్లో ప్రాథమిక వైద్యంతో పాటు 55రకాల రోగ నిర్ధారణ పరీక్షలు జరిగేవి. 125 రకాల మందులను ఇచ్చేవారు. దీంతో సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా కట్టడి చేసేవారు. వాటి ప్రారంభ దశలోనే అలాంటి వ్యాధులను బస్తీ గడప దాటనీయకుండా కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా విశేష కృషి చేసింది. కరోనా వ్యాప్తి చెందిన విపత్కర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానలు మూతబడితే నగరవ్యాప్తంగా అనేక బస్తీ దవాఖానాలు రోగులను అక్కున చేర్చుకొని చికిత్సను అందించాయి. కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిన పని లేకుండా, లాక్‌డౌన్ కారణంగా సరిహద్దుల వద్ద పోలీసులను బ్రతిమాడాల్సిన అవసరం లేకుండా ప్రజలు తమ ఇంటికి అతి సమీపంలోనే కాలినడకన వెళ్లి వైద్యం తీసుకుని తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకున్నారు. ఇంతటి ప్రాముఖ్యత, గుర్తింపు పొందిన బస్తీ దవాఖానలకు కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన 15 నెలల స్వల్ప కాలంలోనే నిర్లక్ష్యపు సుస్తీ పట్టుకున్నది.

వైద్యులు లేక.. నర్సులే వైద్యులై నగరంలోని బస్తీ దవాఖానల్లో వైద్యులు లేకపోవడంతో గత్యంతరం లేక నర్సులే రోగులకు చికిత్స అందిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని మొత్తం 292బస్తీ దవాఖానల్లో హైదరాబాద్ పరిధిలోని 169 బస్తీ దవాఖానలు మినహా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 123బస్తీ దవాఖానల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. మరికొన్ని బస్తీ దవాఖానల్లో కేవలం ఒక్కరే వైద్యుడు ఉండడంతో వారు సెలవుపై వెళ్లిన సమయంలో అక్కడ కూడా నర్సులే దిక్కవుతున్నారు.

(మిగతా IVవ పేజీలో)

### వేధిస్తున్న మందుల కొరత

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బస్తీ దవాఖానల్లో 125రకాల మందులను నాటి బీఆర్ఎస్ సర్కార్ అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీంతో జ్వరం, జలుబు, దగ్గు, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర జబ్బులకు సంబంధించిన అన్ని రకాల మందులను బస్తీ దవాఖానల్లోనే పంపిణీ చేయడంతో ఉస్మానియా, గాంధీ వంటి స్పెషాలిటీ దవాఖానలపై భారం తగ్గింది. కాని ప్రస్తుతం బస్తీ దవాఖానల్లో నెలకొన్న మందుల కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవడమే కాకుండా వారు వైద్యం కోసం బస్తీ గడప దాటి ఉస్మానియా, గాంధీ లేదా ప్రైవేటు దవాఖానల బాట పట్టాల్సి వస్తోందని బాధిత రోగులు ఆరోపిస్తున్నారు. రోగులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు, ముఖ్యంగా వైద్యపరీక్షల నిమిత్తం మూత్ర నమూనాలు ఇచ్చేందుకు మూత్రశాలలు లేకపోవడం, చాలా రకాల వైద్యపరీక్షలను సైతం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఎలివేటెడ్ కారిడార్ కోసం తమ ఆస్తులను ఇవ్వబోమంటూ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన తూంకుంట మున్సిపాలిటీ పౌరులు

# ఎలివేటెడ్‌కు మా ఆస్తులివ్వం

- భూసేకరణలో పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్న వ్యతిరేకత
- గ్రామ సభను బహిష్కరించిన తూంకుంట వాసులు

మేడ్చల్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట వరకు నిర్మించ తలపెట్టిన 18 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్‌కు అడుగడుగునా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నోటీసులు అందుకున్న వారు భూసేకరణ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కారిడార్ నిర్మాణం 200 అడుగుల వెడల్పుతో కాకుండా వంద అడుగుల వెడల్పుతోనే సరిపెట్టాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామస్తులు గ్రామసభల్లో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 100 అడుగులు చాలు

పార్యడైస్ నుంచి శామీర్‌పేట్ రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్(ఫ్లై ఓవర్‌బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించి 2 వందల అడుగుల వెడల్పైన రోడ్డు అవసరమని అధికారులు గుర్తించారు. అందుకోసం అవసరమైన భూసేకరణ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశారు. 2వందల అడుగుల విస్తరణ కోసం రోడ్డుకు రెండు వైపులా లక్ష 26 వేల చదరపు అడుగుల భూమి అవసరానికి సంబంధించి, 384 నిర్మాణాలకు సర్వే చేసిన అధికారులు మార్క్‌అవుట్‌ను పూర్తి చేశారు. ఆస్తులు కోల్పోతున్న వారందరూ గ్రామ సభకు హాజరు కావాలని నోటీసులు అందించారు. అయితే తూంకుంట మున్సిపాలిటీలో గురువారం అధికారులు నిర్వహించిన సభకు తూంకుంట, పోతాయిపల్లి, హకీంపేట్‌లలో భూ సేకరణలో ఆస్తులు కోల్పోతున్న వారు ఆందోళన చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి వంద ఫీట్ల భూమి మాత్రమే సరిపోతుందని, అదనంగా మరో వంద ఫీట్లు భూసేకరణ చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞాప్తి చేశారు. భూ సేకరణ వల్ల తాము అన్యాయానికి గురవుతామని సభకు వెళ్లకుండా బహిష్కరించారు. దీంతో తూకుంట, పోతాయిపల్లి, హకీంపేట్ గ్రామాలకు చెందిన భూ సేకరణ పక్రియపై మరోమారు గ్రామ సభను

(మిగతా IVవ పేజీలో)

### 12 కిలోమీటర్ల మేర..

ముఖ్యంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో శామీర్‌పేట్ రింగ్ రోడ్డు నుంచి సికింద్రాబాద్‌లోని లోతుకుంట వరకు 12 కిలో మీటర్ల భూ సేకరణ పక్రియలో అనేక అభ్యంతరాలు వస్తున్నాయి. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ గుర్తింపు పక్రియను ఇటీవలే ప్రభుత్వం పూర్తి చేసింది. ఆస్తులను గుర్తిస్తూ నోటీసులు అందించింది. కాగా ఆస్తులు కోల్పోతున్న వారు అవార్డు జారీ కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలకు సహకరించడం లేదు. ఇందులో భాగంగానే భూ సేకరణపై రెవెన్యూ భూ సేకరణ అధికారులు తూకుంటలో గురువారం నిర్వహించిన సభను ఆస్తులు కోల్పోతున్న ప్రజలు బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో భూ సేకరణ పక్రియ ముందుకు వెళ్లేందుకు మరింత అలస్యం అయ్యే అవకాశం ఉంది.

# కబ్జా చేయ్.. ఇల్లు కట్టేయ్

- రోడ్డు స్థలంలో అక్రమంగా భవన నిర్మాణం
- కాంగ్రెస్ కార్పొరేటర్ అనుచరుడి భూకబ్జా
- దారి వదలకుండా తమ ఇళ్ల ముందే భవనం నిర్మిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు

సిటీ బ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ): నగరంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు భూకబ్జాలకు తెగబడుతున్నారు. సిటీలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా ఆక్రమించేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారం అండ చూసుకుని ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో బరితెగిస్తున్నారని మండిపడుతున్నారు. జూబ్లీహిల్స్ పరిధి రహమత్ నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ హిల్స్ వినాయక నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అనుచరుడు రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి భవనం నిర్మిస్తున్నారని బోరబండ పోలీస్ స్టేషన్, యూసుఫ్‌గూడ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశామని చెబుతున్నారు. కబ్జా చేసింది అధికార పార్టీ నేతలు కావడంతో అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. కార్పొరేటర్ అనుచరుడు భవనం నిర్మిస్తున్న 80 గజాల స్థలంలో గతంలో వాటర్ ట్యాంక్ ఉండేదని స్థానికులు తెలిపారు. ఇటీవల ట్యాంక్ శిథిలమవడంతో బల్దియా అధికారులు దాన్ని తొలగించారు. దీంతో అక్కడ ఖాళీ స్థలం ఏర్పడటంతో కార్పొరేటర్ అనుచరుడు దానిపై కన్నేసి అక్రమ నిర్మాణం చేపట్టారని చెబుతున్నారు. అక్కడ భవనం నిర్మిస్తే తమ రాకపోకలకు అడ్డుగా ఉంటుందని వాపోతున్నారు.



వినాయకనగర్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మితమవుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్ అనుచరుడి భవనం

### అనుమతులు లేవంటూ రివోకేషన్ లెటర్

ఆక్రమణదారుడు భవన నిర్మాణాన్ని నిలిపేయాలని జీహెచ్ఎంసీ రివోకేషన్ లెటర్ పంపింది. యాజమాన్య పత్రాలు, లింక్ డాక్యుమెంట్లను సమర్పించని కారణంగా టీజీబీపాస్ యాక్ట్-2020 కింద అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఒక వేళ అక్రమంగా నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఆవేమీ పట్టించుకుకోని ఆక్రమదారుడు నిర్మాణాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల నుంచి నిర్మాణం చేపట్టవద్దని నోటీసు అందినా కొనసాగించడం వెనుక ఉన్న మతలబేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక ఎవరున్నారనే అనుమానాలు లేవనెత్తుతున్నారు. బల్దియా అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## విమానాశ్రయానికి క్యాబ్‌లు బంద్

### 13 రోజులుగా.. క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

సిటీబ్యూరో, మార్చి 21 ( నమస్తే తెలంగాణ) :13 రోజులుగా క్యాబ్ డ్రైవర్లు విమానాశ్రయానికి ట్రిప్పులు నిలిపివేయడంతో దేశీయ, విదేశీయ ప్రయాణికులు ఇక్కట్ల పాలవుతున్నారు. విమానాశ్రయం వద్ద క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉండకపోవడంతో వాళ్లంతా వాహనాల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులకు క్యాబ్ సర్వీసులు అందుబాటులో లేవని..ప్రత్యామ్నాయాలు చూసుకోవాలంటూ విమానాశ్రయ సిబ్బంది సూచిస్తున్నారు. కాగా ఓలా, ఉబర్, ర్యాపిడోలు ట్రిప్పు ధరలు తగ్గించి డ్రైవర్లకు అన్యాయం చేస్తున్నదని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్, గిగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సలావుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పారు. ఇప్పటి వరకు 58వేల మంది డ్రైవర్లు ఎయిర్‌పోర్ట్ రైడ్ బహిష్కరణలో పాల్గొన్నారని వివరించారు. మరోవైపుఇదే అదునుగా భావించిన రెంటల్ కార్ల నిర్వాహకులు ప్రయాణికుల దగ్గర నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రభుత్వమే యాప్ తీసుకొస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మొండి చేయిచ్చిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.





శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరుతో అంటించిన స్టిక్కర్

## ప్రోటో కాల్ రగడ

### ఉప్పల్ ఎమ్మెల్యే పేరును విస్మరించిన అధికారులు

ఉప్పల్ , మార్చి 21: ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ప్రోటోకాల్ రగడకు దారితీసింది, హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇన్విటేషన్ కార్డులో ఎమ్మెల్యే పేరు లేకపోవడంతో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఓ వైపు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడం.. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అప్పటికప్పుడు శిలాఫలకంపై హడావుడిగా ఎమ్మెల్యే పేరును స్టిక్కర్‌తో అంటించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ చేయడం కొసమెరుపు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సెక్రటరీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావడం, స్థానిక కాంగ్రెస్ నేతలు అక్కడ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.